www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 3 ఆగస్టు 2025

5

## సిద్ధార్థలో ఘనంగా స్నేహితుల దినోత్సవం

బ్యాడ్జీలు కట్టుకుంటున్న విద్యార్థులు

**ప్రజాశక్తి - ఆలమూరు**

శ్రీసిద్ధార్థ పాఠశాలలో శనివారం నిర్వహించిన స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కె.ముల్లారావు విచ్చేసి విద్యార్థులకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టు నెల మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవం జరుపుకుంటారన్నారు. ఆపదలో ఆదుకునే వారే నిజమైన మిత్రులు అని అన్నారు. విద్యార్థులంతా మంచి స్నేహ తత్వాన్ని అలవర్చుకుని మంచి మిత్రులుగా అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం విద్యార్థులు తమ స్నేహానికి గుర్తుగా ఫ్రెండ్ షిప్ బ్యాడ్జి కట్టి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గుణశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కౌలు రైతుల ఆశలపై నీళ్లు

- అందని అన్నదాత సుఖీభవ
- కుటుంబంలో ఒకరికే పథకం వర్తింపు

అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల గుర్తింపునకు ప్రభుత్వం విస్తృత కసరత్తు చేసింది. దీన్ని ఆగస్టు రెండున అమలులోకి తీసుకు వచ్చింది. గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన దాని కన్నా ప్రస్తుత సర్కారు ఈ పథకం కింద ఇచ్చే మొత్తాన్ని భారీగా పెంచింది. గత ప్రభుత్వం కేంద్రంతో కలిసి రూ.13,500 ఇస్తే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు చేసింది. ఈ మొత్తం అనర్హులకు అందకుండా, అర్హులకు అన్యాయం జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకొంటాం అంటూ కౌలు రైతులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

**ప్రజాశక్తి - రాజోలు**

కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి అమలు చేస్తున్న పిఎం కిసాన్ పథకానికి రాష్ట్రప్రభుత్వం తన నిధులను కలిపి అన్నదాత సుఖీభవను అమలు చేస్తోంది. పిఎం కిసాన్ పథకం కింద కేంద్రం ఏటా రూ.6వేల నగదును మూడు విడతలుగా రైతుల ఖాతాలకు జమ చేస్తోంది. దానికి మరో రూ.7,500 కలిపి గత వైసిపి ప్రభుత్వం ఏటా రూ.13,500 రైతులకు ఇచ్చింది. అయితే ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల ప్రచార సమయంలో టిడిపి ప్రకటించింది. ఇందుకు సంబంధించి తొలిదశ ప్రక్రియ పూర్తయింది. అందులో వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఉన్న రైతు ఖాతాలను నేరుగా రాష్ట్రప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా జాబితాలను ప్రాథమిక పరిశీలన కోసం జిల్లాలకు పంపించింది. జిల్లాలో 3,67,049 మంది రైతుల వివరాలకుగాను జిల్లాలో 1,33,933 మందికి ఈ సొమ్ము అందనుంది.ఇంకా 40,374 మంది కౌలు రైతులు జిల్లాలో ఉన్నారు. ఏటా పిఎం కిసాన్ సమ్మాన్ పథకంలో ఒక్కొక్క రైతుకు రూ.ఆరు వేలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే. దీనిని రైతుల ఖాతాలో ఏడాదికి మూడు దఫాలుగా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మూడు దఫాలుగా అన్నదాత సుఖీభవ నిధులు అందించనున్నట్టు తెలిపింది. దీనిలో భాగంగా పిఎం కిసాన్ నిధులు రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ నిధులు రూ. ఐదువేల చొప్పున మొత్తం రూ.ఏడు వేలు రైతుల ఖాతాలో జమకానుంది. జిల్లాలో మొత్తం రూ.93.75 కోట్లు ఇవ్వనున్నారు.

నెలకు రూ.10వేల కన్నా అధికంగా పెన్షన్లు పొందే వారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించేవారికి పథకం వర్తించదు. ఆధార్ సీడింగ్ ఆధారంగా ఇలాంటి వారిని గుర్తించే ప్రక్రియను ప్రభుత్వస్థాయిలోనే చేస్తున్నట్లు సమాచారం. అది పూర్తయిన తర్వాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాలను తిరిగి జిల్లాలకు పంపిస్తారు. మళ్లీ ఆ జాబితాలలో పేర్లు ఉన్న వారందరికీ ఇకెవైసి చేయాలి. అది కూడా గతంలో ఈక్రాప్ నమోదు, ఇతరత్రా వాటికి చేసిన తరహాసెల్‌ఫోన్ నంబర్ ఒటిపితో ఇకెవైసి చేసే అవకాశం లేదు. విధిగా సదరు లబ్ధిదారులుగా గుర్తించిన రైతుల వేలిముద్ర లేదా ఐరీస్ ద్వారా ఇకెవైసి చేయించుకోవాలి.

**ప్రక్రియ పూర్తి కావాలి**

ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం వాస్తవ పట్టా భూముల యజమానులు, అటవీ భూముల హక్కు పత్రాలు ఉన్న వారికి మాత్రమే ఈ పథకం అందనుంది. కౌలు రైతులకు, దేవదాయ భూములు సాగు చేస్తున్న వారికి అందే అవకాశాలు లేవు. కౌలు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నా అధికారికంగా కౌలుగుర్తింపు కార్డులు ఉన్నవారే అర్హులు, అలాంటి కార్డులు ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభ తర్వాత జారీ అవుతాయి. దానివల్ల తొలివిడతగా పథకం అందించే లబ్ధిదారులలో వారు ఉండే అవకాశం లేదు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మరోసారి తనిఖీ చేయనుంది. ప్రక్రియ అంతా పూర్తయి అక్టోబర్ లో అన్నదాత సుఖీభవ అందే అవకాశం ఉంది.

**కుటుంబంలో ఒకరికి మాత్రమే**

గత వైసిపి ప్రభుత్వం వివిధ పన్నులు చెల్లించే వారిని ఈ పథకంలో అనర్హులుగా చూపించారు. సమస్య ఉన్న వారు ఆడిటర్‌ను సంప్రదిస్తే ధ్రువపత్రం ఇస్తారు. అది వ్యవసాయ అధికారులకు ఇస్తే పరిశీలించి జాబితాలో నమోదు చేస్తారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుంది. వెబ్‌ల్యాండ్‌లో రైతు ఆధార్ సంఖ్య తప్పుగా ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించి సరి చేసుకోవాలి. పేరు నమోదైన రైతు మృతి చెందినట్లయితే అందులో మార్పు జరగకపోయినా సరే వర్తించదు. జాబితాలో పేరు లేకపోయినట్లయితే వ్యవసాయ కేంద్రాల్లో సహాయకులను సంప్రదించి సరిదిద్దుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం ఆన్‌లైన్ పోర్టల్‌లో అర్హులైన రైతుల ఎంపిక బాధ్యత గ్రామస్థాయిలో రైతు సేవాకేంద్రం సిబ్బందికి అప్పగించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన జాబితాను మండల వ్యవసాయాధికారి, తహశీల్దారు పరిశీలించి ఆమోదం తెలపాలి. వీటిని రెవెన్యూ యంత్రాంగం సకాలంలో పరిష్కరించడం లేదు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది పరస్పర సహకారంతో త్వరితగతిన నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని ఉన్నతాధికారులు సూచించారు. తప్పులు సరిదిద్దితేనే రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉన్నందున కలెక్టర్లు దృష్టి సారించి వేగవంతం చేయాలని ఆదేశించారు.

**సరిదిద్దాల్సినవి ఇవే**

రైతుల పట్టాదారు పాసుపుస్తకాలకు తప్పు ఆధార్ మ్యాప్ కావడం.ఒకే ఆధార్ నంబరును ఎక్కువమంది పట్టాదారులకు నమోదు చేయడం.రీసర్వే జరిగిన గ్రామాల్లో కొన్ని సర్వే నంబర్లకు ఎక్కువ మొత్తం విస్తీర్ణం నమోదు కావడం. రీసర్వే గ్రామాల్లో ఒకే విస్తీర్ణం చాలామందికి నమోదవడం. పట్టాదారులకు ఆధార్‌నంబరు అనుసంధానం కాకపోవడం

### కౌలు రైతులకు అమలు చేయాలి

అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల సంఖ్య తగ్గించడం దారుణం. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది గడిచిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు శ్రీకారం చుట్టడం రైతులకు అన్యాయం చేయడమే. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకూ అమలు చేసి వారిని ఆదుకోవాలి. **–పీతల రామచంద్ర రావు, ఎపి కౌలు రైతు సంఘం, జిల్లా కార్యదర్శి**

## ప్రోటోకాల్ ఉల్లంఘన పై డిఎల్‌పిఒకు ఫిర్యాదు

**ప్రజాశక్తి - అమలాపురం రూరల్**

ఈ నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ ను పిలవకుండా ప్రోటోకాల్ పాటించలేదని పేరూరు గ్రామ సర్పంచ్ దాసరి అరుణ అమలాపురం డిఎల్‌పిఒ బొజ్జరాజుకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఒక టిడిపి నాయకుని ఇంటి వద్ద ఏర్పాటు చేసిన పింఛన్ల కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం తనను పిలవలసి ఉందన్నారు. అయినప్పటికీ తనను ఆహ్వానించలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కుల వివక్ష కారణంగా తనను పిలవకుండా అవమానపరిచారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘన పై కలెక్టర్‌కు తాను ఫిర్యాదు చేస్తానని తెలిపారు. డిఎల్‌పిఒను కలిసిన వారిలో ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీను, దొంగ ఆంజనేయులు, అప్పారి లక్ష్మీనారాయణ,మాజీ ఎంపీటీసీ దాసరి నాగేశ్వరరావు,వార్డు సభ్యులు ఉన్నారు.

## ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

**ఫ్యాప్టో నాయకుల డిమాండ్**

**ప్రజాశక్తి - అమలాపురం**

కలెక్టర్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. నల్ల వంతెన వద్ద ఉపాధ్యాయ ఐక్యత ఫ్యాప్టో ధర్నాను జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎమ్‌టివి.సుబ్బారావు, సెక్రటరీ జనరల్ పోతంశెట్టి దొరబాబు ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపి మూర్తి, సిపిఎం, సిపిఐ నాయకులు కె.సత్తిబాబు, కారెం వెంకటేశ్వరరావు, ఎంఇఒలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొని మద్దత్తు పలికారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు భారీ నినాదాలు చేశారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు అన్నివిధాలా సహకరిస్తామ ని చెప్పి ప్రస్తుతం ఉపాధ్యాయులందరిని అమరావతి అప్ చట్రంలో ఇరికిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాప్‌లు ప్రవేశపెట్టి ఉపాధ్యాయుల అనే నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. గత వైసిపి ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు ఉపాధ్యాయులు మనోభావాలను పట్టించుకోవడం లేదని ఈ ప్రభుత్వాలు ద్వంద వైఖరి చూపిస్తున్నాయని అన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రంను కలెక్టర్ కార్యాలయ అధికారి ఎఒ విశ్వేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి కె.రాంచంద్రం, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎస్–ఎస్.పల్లంరాజు, పి.వెంకటేశ్వరావు, ఎస్ఎన్.మునేశ్వరరావు, కార్యదర్శులు సబ్బీర్ హుస్సేన్, జివివి.సత్యనారాయణ, అబ్దుల్ రహీమ్, మహిళ ఉపాధ్యాయురాలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మిడ్డే మీల్స్ యూనియన్ నుంచి సత్యవేణి బహిష్కరణ

**ప్రజాశక్తి - అమలాపురం**

మిడ్డే మీల్ నూతన కమిటీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన ఎస్. బేబీ సరోజిని ,టి. నాగ వరలక్ష్మి

సంఘ విచ్ఛిన్నానికి పాల్పడినందున సత్యవేణిని మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నుంచి బహిష్కరిస్తున్నట్లు మిడ్డే మీల్ నూతన కమిటీకి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఎస్.బేబీ సరోజిని, టి.నాగవరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పోరాడతామని అన్నారు. ఈ మధ్యకాలంలో అనేక చోట్ల రాజకీయ వేధింపులతో మధ్యాహ్న భోజన కార్మికుల్ని చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నిరుద్యోగులు గౌరవ వేతనంతో బతికే వారికి ప్రతి నెల బిల్లులు రాకపోయినా వేతనాలు చెల్లించక పోయినా, అప్పులు చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని నడుపుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రతినెల వేతనాలు బిల్లులు చెల్లించాలని, వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని నాణ్యమైన రాగి పిండి ఇవ్వాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు యూనిఫామ్ ఇవ్వాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు. అనంతరం 23 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యవర్గ సభ్యులు భాస్కరరావు, బండి వెంకటలక్ష్మి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వరలక్ష్మి, నాగమణి, వెంకటలక్ష్మి, లక్ష్మి, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

## 150 మందికి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి - ఆత్రేయపురం**

ఆత్రేయపురంలో నిర్వహించిన శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక రావి చెట్టు సెంటర్లో గ్రంథాలయం వద్ద శనివారం అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, శ్రీకర మల్టీ స్పెషాలిటీ అండ్ రోబోటిక్స్ ఆసుపత్రి రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.వి.చంద్రకాంత్ వర్మ, డాక్టర్ జి.రోహిత్ కుమార్, డాక్టర్ హర్ష కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిం చారు. 140 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమం ఎడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ కన్వీనర్ గాదిరాజు ప్రసాదరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## సిపిఐ మహాసభల జయప్రదానికి పిలుపు

**ప్రజాశక్తి - రామచంద్రపురం**

ఒంగోలులో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించే సిపిఐ మహాసభలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రజా కళాకారులు తదితరులు పాల్గొని జ యప్రదం చేయాలని డాక్టర్ స్టాలిన్ పిలుపునిచ్చారు. శనివారం రామచంద్రపురంలో ఆయన నివాసంలో సమావేశం నిర్వహించారు. సిపిఐ కోనసీమ జిల్లా సహాయ కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


కొమానపల్లిలో చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

**ప్రజాశక్తి - యంత్రాంగం**

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజాప్రతినిధులు అన్నారు. శనివారం అన్నదాత సుఖీభవ– పిఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించారు. **ముమ్మిడివరం:** కొమానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రాంగణంలో శనివారం పిఎసిఎస్ అధ్యక్షుడు పొద్దుకు నారాయణ రావు అధ్యక్షతన 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా అందించే పిఎం కిసాన్ చెక్కుల పంపిణీ చేశారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎంఎల్ఎ సుబ్బరాజు ముఖ్య అతిధులుగా పాల్గొని రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. ఇరువురు మాట్లాడుతూ నియోజకవర్గంలో 23,468 రైతులకు రూ.16.43 కోట్ల సాయాన్ని రైతులకు అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గోలకోటి దొరబాబు, గుద్దటి జమ్మి, సర్పంచ్ కాశి ఇందిర, ఎంపిపి కోలా గంగా భవాని తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** స్థానిక శ్రీ సీతారామ కళ్యాణ మండపం లో హామీ అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో మొత్తం 18, 229 మంది రైతులకు రూ 12.49 కోట్లు లబ్ధిచేకురుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** .గొల్లవిల్లిలో శనివారం పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమాన్ని నియోజకవర్గస్థాయిలో ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు నిర్వహించారు. అనంతరం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో రైతులకు విడుదలైన రూ.9 కోట్ల 24 లక్షల 62 వేల నమూనా చెక్కును రైతులకు ఎంఎల్ఎ ఆనందరావు విడుదల చేశారు. కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, సర్పంచ్ లు చిక్కం పెదబాబు, ఇసుకపట్ల జయమణి, ఎంపిటిసి సభ్యులు దేశంశెట్టి నాగరత్నకుమారి, నిమ్మకాయల రాము, రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, డిసిఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు తదితరులు పాల్గొ న్నారు. **ఆలమూరు:** అన్నదాతలకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ, బీటీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవంలో ఆయన ఆర్‌డిఒ పి.శ్రీకర్, జనసేన నియోజకవర్గ ఇంచార్జి బండారు శ్రీనివాస్, తదితర నేతలతో కలిసి హాజరై మాట్లాడారు. కొత్తపేట నియోజకవర్గంలో మొత్తం 23,018 మంది రైతులకుగాను రూ.16,11,26,000లు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.16.11 కోట్ల నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు ఆకుల రామకృష్ణ, కెవి.సత్య నారాయణ రెడ్డి, కరుటూరి నరసింహారావు, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, పాలూరి సత్యానందం, నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, ఎఎంసి ఛైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ద్రాక్షారామస్త్ర మార్కెట్ యార్డ్ లో అన్నదాత సుఖీభవ మొదటి విడత పెట్టుబడి సాయం విడుదల కార్యక్రమంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవరకొండ అఖిల, ఎడిఎ నాగ కుమార్, పార్టీ అబ్జర్వర్ కె.రామారావు , మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రైతు సంఘం అధ్యక్షుడు శివ ప్రసాద్, కొంచు మర్తి బాబురావు, వివిధ గ్రామాలు సహకార సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఛైర్మన్లు చైతన్య, విజయబాబు, పేపకాయల నారాయణ రావు , మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీను, టౌన్ అధ్యక్షులు ఉండవల్లి చౌదరి తదితరులు పాల్గొన్నారు. **రాజోలు:** స్థానిక మండల పరిషత్ అధికారి కార్యాలయం జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో నాలుగు మండలాలలో 23,293 రైతులకు గాను రూ.16.30 కోట్లు వారి ఖాతాలలో జమ అయ్యిందన్నారు. కార్యక్రమం లో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల నర్సింహా రావు, జడ్‌పిటిసి సభ్యురాలు మట్టా శైలజ, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, పొలుమూరి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు


ద్రాక్షారామంలో చెక్కు అందిస్తున్న ఎంఎల్‌సి రాజశేఖర్, ఆర్‌డిఒ


గొల్లవిల్లిలో చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు


మండపేటలో చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

చెక్కు అందజేస్తున్న రాజోలు ఎంఎల్ఎ దేవవరప్రసాద్

## జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి - ఆలమూరు**

మండలంలోని కొత్తూరు సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శనివారం 2.50 ఎకరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం చుట్టూ రూ. 8 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి నియోజకవర్గ జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్, కూటమి శ్రేణులతో కలిసి హాజరైనా ఆయన భూమి పూజ చేశారు. శిథిలమవుతున్న కళాశాల పాత భవనం పూర్తిగా తొలగించి ఆ ప్రదేశంలో నూతన భవనం నిర్మించేలా అన్ని చర్యలు తీసుకుంటామనారు. ఈ అంశాన్ని ఇప్పటికే కలెక్టర్ మహేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా చూడాలని కోరినట్లు తెలిపారు. అలాగే కళాశాల ప్రాంగణంలో అధికారులు, నాయకులతో పర్యటిస్తూ ఆక్రమణలపైనా ఆయన ఆరా తీశారు. ఆక్రమణలు తొలగించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రతిభ పాటవాలు కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు కొత్తపేట నియోజకవర్గం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన రూ.5 వేల చొప్పున నగదును ఎంఎల్ఎ బండారు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సొసైటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్, సర్పంచ్ సంగీత సుభాష్, జనసేన మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, ఎంపిడిఒ ఎ.రాజు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**నిధుల మంజూరుపై హర్షం**

కొత్తూరు సెంటర్ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వచ్చిన కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు కలిసి ఆనందం వ్యక్తం చేస్తూ, కాలేజి అబివద్ధి కోసం ప్రభుత్వం ముందడుగు వేయడం హర్షణీయమని జిల్లా ఉపాధ్యక్షులు జి.సందీప్ అన్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ నేతలు మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఆలమూరు జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాలేజీ ప్రహరీ గోడ, నూతన తరగతి గదులు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నాడు. గత కాలేజి కమిటీని రద్దు చేసి నూతన కాలేజి కమిటీ వేయాలని, తదితర సమస్యలు, కళాశాల నూతన భవనం నిర్మాణం యుద్ధ ప్రతిపాదికలో పూర్తి చేయాలని కోరుతూ ఎంఎల్ఎ బండారు సత్యానందరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు నూకన్న ప్రసాద్, సతీశ్, వినయ్, శ్యామ్, గణేష్, రామచంద్ర పలువురు పాల్గొన్నారు.

## కార్టూ'నిజం'




కుంభకోణాల ఊబిలో వైద్య విద్య

## వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌కు సత్కారం

**ప్రజాశక్తి - ఉప్పలగుప్తం**


డాక్టర్ శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న నాయకులు

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ కోఆర్డినేటర్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత శనివారం తొలి సారిగా ఎస్.యానం గ్రామం విచ్చేశారు .ఈ సందర్భంగా వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్‌ను వైసిపి జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను ఆధ్వర్యంలో దుశ్శాలువా కప్పి గజ మాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్.యా నాం, చల్లపల్లి, సరిపల్లిలో వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీకాంత్ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి, జడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దంగేటి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజ కుమారి, వైసిపి జిల్లా కార్యదర్శులు దంగేటి దొరబాబు, బడుగు మేరీ కుమారి, వైసిపి మహిళా, యువజన, బిసి విభాగాల మండల అధ్యక్షులు జొన్నాడ శ్రీదుర్గ, ఒగూరి విజయ్ కుమార్, యనమదల పల్లంరాజు నాయకులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అభినందనీయం

**ప్రజాశక్తి -మామిడికుదురు**

దాత నిర్మించిన డైనింగ్ హాల్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పాశర్లపూడికి చెందిన డాక్టర్ భూపతి నాగేశ్వరరావు స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.35 లక్షల వ్యయంతో మామిడికుదురు హైస్కూల్ ఆవరణలో నిర్మించిన డైనింగ్ హాలును శనివారం ఎంఎల్ఎ ప్రారంభించారు ఆ కుటుంబ సభ్యులంతా ఆ పాఠశాలలోనే చదువుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. భూపతి నాగేశ్వరరావు చిత్రపటానికి ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ఎంపిపి కుసుమ వనజ కుమారి, సర్పంచ్ గౌస్ మోహిద్దీన్, నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎంపిటిసి సభ్యురాలు నైనాల సీతామహాలక్ష్మి, జనసేన నాయకులు విల్ల సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు

## నిత్యాన్నదానానికి దాతల విరాళాలు

**ప్రజాశక్తి - మామిడికుదురు**

అప్పనపల్లి బాల బాలాజీ ఆలయంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శనివారం హైదరాబాద్ వాసులు వేగి రైతు లక్ష్మి పవన్ నాగ తులసి దంపతులు, చిరంజీవి రోషిని సునంద కుటుంబ సభ్యులు రూ.10,116, తాటిపాక వాసులు మొల్లేటి శ్రీనివాసరావు వరాహలక్ష్మి దంపతులు చిరంజీవి ప్రణీత కౌశిక్ వారి కుటుంబ సభ్యులు రూ.10,116లు విరాళాలు సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. ఆలయ అర్చకులు దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు

**శనివారం ఆదాయం రూ.2.78లక్షలు**

బాల బాలాజీ ఆలయానికి వివిధ విభాగాల ద్వారా శనివారం రూ.2,78,173 ఆదాయం సమకూరింది ఇందులో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ. 77,978 లు, శాశ్వత నిత్యాన్నదానా ట్రస్ట్‌కు రూ. 20,232లు ఆదాయం సమకూరిందన్నారు 5వేల మంది యాత్రికులు స్వామి వారిని దర్శనం చేసుకోగా 2,800 మంది యాత్రికులు అన్న ప్రసాదం స్వీకరించారన్నారు

# ఆశ.. నిరాశ..

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి**

ప్రభుత్వ సంక్షేమ పకాలు అర్హులకు సైతం దూరం కావటంతో దరఖాస్తుదారులలో ఆందోళన వ్యక్తమవుతంది. గత నెలలో విడుదుల చేసిన తల్లికి వందనం మొక్కుబడిగా అమలు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకున్న విషయం విదితమే. తాజాగా ఈ వారాంతలో విడుదలైన అన్నదాత సుఖీభవ పథకంలో ఇదే దుస్థితి తలెత్తింది. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూశారు. ఎట్టకేలకు కొందరి ఖాతాల్లో జమయ్యాయి. అత్యధిక మందికి ఖాతాల్లో జమ కాకపోవటంతో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయకతప్పలేదు. అయితే అర్హులందరికీ పథకం నగదు జమ చేస్తామంటూ అధికారులు చెప్పటంతో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరో 3 వారాల్లో ఉచిత బస్సు పథకం అమలు చేస్తామంటూ మరోవైపు కొన్ని బస్సులకే పరిమితం చేయడంతో మహిళల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలులో నిబంధనల కొర్రీలు అర్హులను దూరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మరోవైపు ధరల పెరుగుదల మూలిగే నక్కపై తాటికాయ చందంగా మారుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**వార్డెన్లకు.. అప్పుల తిప్పలు**

విద్యా సంవత్సరం ప్రారంభమైన 3 నెలలు గడుస్తున్నా జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల బిల్లులు చెల్లింపులో నిర్లక్ష్యం వెంటాడుతోంది. జిల్లావ్యాప్తంగా సంక్షేమ హాస్టవార్డెన్లు అప్పుల తిప్పలతో అవస్థలు పడుతున్నారు. గడిచిన నెల రోజులలో నిత్యావసర సరుకుల ధరలు ఘణనీయంగా పెరిగాయి. కందిపప్పు కిలో రూ.173కు చేరింది. వంటనూనెల ధరలు నింగిని తాకుతున్నాయి. 20 నుంచి 30 శాతానికి చేరటంతో పామాయిల్ కిలో రూ.100కు చేరింది. చింతపండు ధర రూ.140కి చేరింది, ఉప్పు ధర రూ.5 నుంచి 15కు పెరిగింది. వాటితోపాటు కాయగూరల ధరలు రెండు, మూడు రెట్లు పెరిగాయి. కోడిగుడ్ల ధరలు రూ.7కి చేరాయి. ప్రతి హాస్టల్‌కు సుమారు రూ.లక్ష బిల్లులు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితులలో అప్పులు చేసి నిర్వహణ కొనసాగిస్తున్నట్లు వార్డెన్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి త్వరితగతిన బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు**

కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిక్కుళ్లు కేజీ రూ.100 మార్కు దాటేసింది. మిర్చి కేజీ రూ.80కు చేరాయి. వంకాయలు, బీర, ఇతర ఏ రకమైనా కేజీ రూ.60 వెచ్చించాల్సిందే. ఉల్లి కోయకుండానే కన్నీళ్లు తెప్పిస్తోంది. నాణ్యత ఆధారంగా కేజీ రూ.30 నుంచి రూ.40 చొప్పన విక్రయాలు జరుగుతున్నాయి. టమోటా కేజీ రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయాలు జరుగుతున్నాయి. శ్రావణమాసం కావటంతో ధరలు నింగినితాకుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కూరగాయలు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేక రైతు బజార్లకు వెళ్లిన కొనుగోలుదారులకు నిరాశే మిగులుతోంది. కూరగాయల నాణ్యత లేకపోవడంతో రైతు బజార్ల లక్ష్యం నీరు కారుతోంది. జిల్లాలోని రైతు బజార్ల నుంచి నాణ్యమైన కూరగాయలు వ్యాపారులకు, హోటళ్లకు తరలిపోతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతు బజార్లలో నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని కొనుగోలు దారులు కోరుతున్నారు.

**స్మార్ట్ మీటర్లపై వినియోగదారులు గుర్రు**

కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వాణిజ్య సంస్థలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించిన విషయం విదితమే. వినియోగదారులకు ఒక్కసారిగా బిల్లులు అదనంగా రావడం, బిల్లులు చెల్లింపులలో ఆలస్యమైతే ఎటువంటి సమాచారం లేకుండా సరఫరా నిలిపివేయటంతో వినియోగదారులు ఆందోళన బాట పడుతున్నారు. ఈ ఆందోళనలకు వామపక్ష పార్టీలు అండగా నిలవటంతో ఎట్టకేలకు విద్యుత్ శాఖ దిగొచ్చింది. ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించక తప్పలేదు. అదనపు బిల్లులపై తమకు ఫిర్యాదు చేయవచ్చని, వినియోగదారుల అనుమతి లేకుండా ఏ ఒక్కరికీ స్మార్ట్ మీటర్లు బిగించబోమంటూ పత్రికా ముఖంగా వెల్లడించారు. దీంతో వినియోగదారులకు కొంత ఊరట లభించింది.

## నేరాలు ఘోరాలు

### గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**ప్రజాశక్తి - జగ్గంపేట**

మండలంలోని కాట్రావులపల్లి వద్ద గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...కాట్రావులపల్లి గ్రామానికి చెందిన కె.లోవరాజు 4.38 కేజీల గంజాయిని ప్యాకెట్లుగా తయారు చేసి శనివారం పెద్దాపురం వైపు వెళ్తుండగా ఐఒసిఎల్ బంక్ సమీపంలో పట్టుకోవడం జరిగిందన్నారు. అతన్ని పెద్దాపురం కోర్టులో హాజరుపర్చగా 14వ తేదీ వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

### గాయపడిన వృద్ధుని మృతి

**ప్రజాశక్తి - కాజులూరు**

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు కాల సత్యనారాయణ (62) ఆరోగ్యం విషమించి శనివారం మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం గొల్లపాలెంలో ద్విచక్ర వాహనాల ఢీకొన్న ప్రమాదంలో కాల సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. అతను కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గొలుసు దొంగకు స్థానికుల దేహశుద్ధి

**ప్రజాశక్తి - తాళ్లరేవు**

మహిళ మెడలో గొలుసు దొంగిలించి పారిపోయిన దొంగను మండలంలోని సుంకరపాలెం జంక్షన్‌లో స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. కె. గంగవరం మండలం బ్రహ్మపురి గ్రామంలో ఇంటి బయట నిలబడిన ఓ మహిళ మెడలో గొలుసు అపహరించి ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. వారిని వెంబడించి వచ్చిన స్థానిక యువకులు సుంకరపాలెం జంక్షన్‌లో ఒక దొంగను గుర్తించి పట్టుకున్నారు. స్థానికుల సాయంతో దొంగను పట్టుకుని యానం పోలీసులకు అప్పగించారు. యానాం పోలీసులు ఆ దొంగను కె. గంగవరం మండల పోలీసులకు అప్పగించారు.

### తండ్రిపై హత్యాయత్నం కేసులో నిందితునికి రిమాండ్

**ప్రజాశక్తి - అమలాపురం రూరల్**

ఇన్స్యూరెన్స్ సొమ్ము కోసం తండ్రిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో కుమారునికి కోర్టు శనివారం రిమాండ్ విధించింది. వివరాలు ఇవి.. తన తండ్రి యాక్సిడెంట్‌లో చనిపోతే అతని పేరున బ్యాంకులో ఇతర ఎల్ఐసి ఇన్సూరెన్స్ సొమ్ములు సులువుగా పొందచ్చని అతని కుమారుడు ఒక పథకం పన్నాడు వివరాలు ఇవి.. అమలాపురం మండలం సాకుర్రు గ్రామానికి చెందిన విప్పర్తి హర్షవర్ధన్. హర్షవర్ధన్ ఆర్థికంగా నష్టపోవడంతో అక్రమంగా, సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో తన తండ్రిని యాక్సిడెంట్ చేసి కడతేర్చాలనుకున్నాడు. దానిలో భాగంగానే గత ఏప్రిల్‌లో తన తండ్రి వెంకటరమణ కామనగరువు బైపాస్‌లో ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో అతని కుమారుడు హర్షవర్ధన్ ముందస్తు వ్యూహంలో భాగంగా అద్దెకు కారు తెచ్చుకున్నాడు. ద్విచక్రవాహనంపై వెళుతున్న తండ్రి వెంకటరమణను కుమారుడు హర్షవర్ధన్ ఆ వెనుకనే కారుతో గుద్ది దాన్ని యాక్సిడెంట్‌గా అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో గాయపడిన తండ్రి వెంకట రమణ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోమాలోంచి బయటకు వచ్చాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమలాపురం తాలూకా సిఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ శేఖర్ బాబు, సిబ్బంది పై కేసులో దర్యాప్తు చేశారు. తన తండ్రిని ఉద్దేశ పూర్వకంగానే చంపాలని యాక్సిడెంట్ చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈనెల 1న సాకుర్రు విఆర్ఒతో వచ్చి పోలీస్ స్టేషన్ వద్ద నిందితుడు విప్పర్తి హర్షవర్ధన్ లొంగిపోయాడు. శనివారం నిందితుడుని రిమాండ్ రిపోర్ట్‌తో పాటు అమలాపురం కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ కేసును దర్యాప్తు చేసిన రూరల్ సిఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ వై.శేఖర్ బాబు, సిబ్బంది డి.ఏడుకొండలు, సిహెచ్.ఏసుబాబు, ఎం.నాగరాజు, కె.ఫణీంద్ర కుమార్ లతో కూడిన టీం ను ఎస్పి బి.కృష్ణారావు అభినందించారు.

### వివాహిత ఆచూకీ లభ్యం

**ప్రజాశక్తి - సీతానగరం**

వివాహిత అదృశ్యమైన సంఘటనలో పోలీసులు ఆమె ఆచూకీని కనుగొని బంధువులకు అప్పగించారు. శుక్రవారం సీతానగరం పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. బొబ్బిల్లంక గ్రామానికి చెందిన సోడదాసి లత శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయమై ఆమె భర్త సోడదాసి సీతారామరాజు సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఆమె భర్తకు భయపడి అదే గ్రామంలో తెలిసిన వారి ఇంట్లో ఆశ్రయం పొందుతూ ఉన్నట్టు గుర్తించారు. ఆమెను బంధువులకు అప్పగించారు.

## తల్లిపాలు బిడ్డ ఎదుగుదలకు దోహదం

**ప్రజాశక్తి - కపిలేశ్వరపురం**

తల్లి పాలు బిడ్డ ఎదుగుదలకు, వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు దోహదం చేస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కపిలేశ్వరపురం కోడ్ నెంబర్ 8, కోడ్ నెంబర్ 3,4, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలను మాత్రమే అందించాలని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రు పాలు పట్టించాలని, ఈ పాల వల్ల బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తుందన్నారు. ఈనెల 7 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుబ్బలక్ష్మి, భవాని, ఎఎన్ఎం సుశీల, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి నూతన కోర్సులు

**ప్రజాశక్తి - రాజోలు:**

కేంద్ర ప్రభుత్వ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్‌విఎన్., జెఎస్, ఆర్‌విఆర్., డిగ్రీ కళాశాలలో ఉపాధికి అవసరమయ్యే నూతన కోర్సులను ఈ కొత్త విద్యా సంవత్సరం నుంచి ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రిన్సిపల్ ఎన్.ఆనంద మహని తెలియజేసారు. ఇటీవల ఒకే నెలలో అయిదు పరిశోధన పత్రాలను అంతర్జాతీయ జర్నల్లలో ప్రచురించి ఘనత సాధించిన డాక్టర్ విజయ్ సత్య ప్రసాద్ యర్రంశెట్టి ని కళాశాలలో శనివారం సత్కరించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశోధనలపై దష్టి సారించాలని కోరారు. ఇటీవల తమ కళాశాలను సందర్శించిన ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వైవిఎస్‌కె.మూర్తి దంపతుల చొరవతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఆన్లైన్ కోర్సుల నిర్వహణకు తమకు అవకాశం దక్కడం చాలా గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు కోర్సులు, ఉపాధి అవకాశాలను వెల్లడించారు. గ్రామీణ విద్యార్థులు చదివే ఈ కళాశాలకు ఐఐఆర్ఎస్ కోర్సుల నిర్వహణకు అవకాశం దక్కడం పట్ల సీనియర్ అధ్యాపకుడు ఎన్. రమేష్ బాబు అందరికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఐక్యూఎసి కోఆర్డినేటర్ పిఎస్ఎన్.రాజు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చిట్టాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ సభ విజయవంతానికి పిలుపు

**ప్రజాశక్తి - ఉప్పలగుప్తం**

ఎస్ సి వర్గీకరణ జరిగిన తరువాత ఈనెల 13 న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ తొలిసారిగా అమలాపురం వస్తున్న సందర్భంగా జరిగే సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. గొల్లవిల్లిలో శనివారం ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం మాదిగల సంక్షేమానికి చేపట్టవలసిన పథకాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా కో ఇన్‌ఛార్జ్ సవరపు భైరవమూర్తి, జిల్లా అధ్యక్షులు ఆకుమర్తి రమేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఆకుమర్తి మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నేదునూరి రాజేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పలివెల రాంబాబు, చుట్టుగుళ్ల నీలకంఠం, గంపల మేరీ, గంపల విజయ్, చుట్టుగుళ్ల సత్తిబాబు, సత్తాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాశక్తి - మండపేట**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని కూటమి నాయకులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ చుండ్రు శ్రీ వరప్రకాష్ అన్నారు. మండపేట 20వ వార్డులో ఎన్‌టిఆర్ భరోసా కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయం మున్సిపల్ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి పింఛన్ దారులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో 20వ వార్డు ఇంచార్జ్ మెండిటి సూర్య ప్రకాష్, ప్రెసిడెంట్ టేకి వెంకటరమణ, ఉంగరాల రాంబాబు,నాగేశ్వరరావు, తదితరులు, పాల్గొన్నారు.

ఆలయ ఇఒ వీర్రాజుకు నగదు అందజేస్తున్న దాత వెంకటరావు

## నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం

**ప్రజాశక్తి - ఆలమూరు**

మండలంలోని చింతలూరు నూకాంబిక ఆలయంలో జరుగుతున్న తూర్పు, పడమర గాలి గోపురాల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల నిమిత్తం గ్రామానికి చెందిన ఈదర సత్యం గారి అబ్బాయి వెంకట్రావు, అనంతలక్ష్మి దంపతులు శనివారం రూ.50,116లు విరాళంగా దేవస్థానం ఇఒ వుండవల్లి వీర్రాజుచౌదరికి గ్రామపెద్దల సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా దాతలను ఇఒ అభినందించారు. అనంతరం మాట్లాడుతూ దాతలు ఎవరైనా ఉంటే ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, దొమ్మేటి రామకష్ణ, బుంగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌గా ఎంపికైన మణికంఠకు ప్రముఖుల అభినందన

**ప్రజాశక్తి - ఆలమూరు**

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ పోస్టుల ఫలితాల్లో మండలంలోని బడుగువానిలంకకి చెందిన పాలూరి విజయ మణికంఠ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మణికంఠను శనివారం కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు, కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ తదితర ప్రముఖులు నాయకులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురానికి చెందిన అలేఖ్యకు..**

**కపిలేశ్వరపురం:** కానిస్టేబుల్స్ పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రమైన కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన నూక పెయ్యి అలేఖ్య ( జిల్లాలోని ఓపెన్ కేటగిరి మహిళా విభాగంలో 131 మార్కులతో 17వ స్థానం సాధించి సివిల్ కానిస్టేబుల్ గా ఎంపికయ్యింది. గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, రిటైర్డ్ టీచర్ ఎన్ అబ్బిరాజు, తదితరులు ఆమెను శనివారం అభినందించారు.

## కల్వర్టును ప్రారంభించిన ఎంఎల్ఎ

**ప్రజాశక్తి - మండపేట**

తాపేశ్వరం గ్రామంలో గాగలపేట వినాయకుని గుడి వద్ద 4వ నెంబర్ కాలువ పై గ్రామపంచాయితీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన కల్వర్ట్ ను శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నూని వీర్రాజు, ముత్యాల పట్టాభి, సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి శ్రీనివాస్, కుంచె ప్రసాద్, పితాని వెంకటేశ్వరరావు, చీకట్ల గోవిందరాజు, గోసాల ప్రసాద్, కోరా లక్ష్మినారాయణ, వేగుళ్ళ రామకృష్ణ, వల్లూరి వీరభద్రరావు, ముత్యాల సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు,పాల్గొన్నారు.

## వరదా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

**ప్రజాశక్తి-కడియం**

వరదా ఫౌండేషన్ వ్యవస్థాపకులు వరదా సుబ్బారావు వారి తల్లిదండ్రులు దుర్గారావు, లక్ష్మి సేవలు ప్రశంసనీయమని డిఆర్ఒ ఎం.సీతారామమూర్తి, డిఇఒ వాసుదేవరావు ప్రశంసించారు. అసెంబ్లీలో ఒఎస్‌డి వరదా సుబ్బారావు ఆహ్వానం మేరకు శనివారం హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2024- 25 విద్యా సంవత్సరం కడియం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 500 మార్కులు పైబడిన 28 మంది విద్యార్థులకు, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన నలుగురు విద్యార్థినులకు గత సంవత్సరం 6 నుండి 9 తరగతులలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున, ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి రూ.2,000, రూ.1500, ప్రశంసాపత్రం, మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.రమేష్, తహశీల్దార్ సునీల్, ఎంఇఒ నాగేశ్వరరావు, గొల్లపల్లి సత్యనారాయణ, లావేటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

## సమస్యలపై అంగన్‌వాడీల వినతి

**ప్రజాశక్తి-పెరవలి**

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 4న ఆన్‌లైన్ వర్కులు నిలుపుదల చేస్తామని అంగన్‌వాడీలు తెలిపారు. శనివారం సిడిపిఒ కార్యాలయంలో ఫోన్లు అందజేసి, ఐదో తేదీ నుండి ఆన్‌లైన్ వర్క్ నిలుపుదల చేస్తామని ఈ మేరకు వినతిపత్రాన్ని సిడిపిఒ కార్యాలయ సిబ్బందికి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకులు కృష్ణవేణి, విశాలి పాల్గొన్నారు.

## పోక్సో చట్టంపై కళాశాల విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి -మండపేట**

మరేడుపాక ప్రభుత్వ కళాశాలలో శనివారం పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. వరల్డ్ విమెన్స్ ట్రాఫికింగ్ డే సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది బూసి విద్యాప్రసన్న మాట్లాడుతూ హ్యూమన్ ట్రాఫికింగ్, పోక్సో చట్టం ప్రభావాలు, న్యాయ పరమైన రక్షణలు వంటి అంశాలు, పోక్సోచట్టం ఎలా రక్షణ కల్పిస్తుందో, బాధితులు ఏమి చేయాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ హ్యూమన్ ట్రాఫికింగ్ సమస్య కేవలం అమ్మాయిలకే కాకుండా, అబ్బాయిలపై కూడా ప్రభావం చూపుతోందన్నారు. అందుకే అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ అవగాహనా సదస్సులో విద్యార్థులు పోక్సో చట్టానికి సంబంధించిన పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ఆనంద్, కన్వీనర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు, డాక్టర్ కెఎస్ఆర్.వెంకన్న, అభినయ్, అంజి , చంటి చంటి, సురేష్ తదితరులు, పాల్గొన్నారు.

**మహారాజశ్రీ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ముమ్మిడివరం వారి కోర్టులో**

**OS.No.20/2018**

**Between:-**
Golakoti Vishnu Murthy and others ...వాదులు
And
Golakoti Adinarayana and others ...ప్రతివాదులు
To
**D9.** Sunkara Veeranna S/o.Late Nageswara Rao, Pappulavaripalem, Narendrapuram Village,Kothapeta Mandal, KPT.Jr..C.J.
**D10.** Peddireddy Surya Kumari W/o. Ramababu(Venkata Swamy), Ainavilli Village, Ainavill Mandal, Amp.Prl.Jr.C.J.

ఈ పై నెంబర్ దావాను వాదులు మీ పై దావా ఆస్తిలో వాటా కోరుచూ, స్వాధీనం చెయ్యమని మున్నగు పరిహారములు కోరుచూ వాదులు పై కోర్టులో దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం వాయిదా **06-08-2025వ** తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజున ఉదయం **గం॥10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెనన్నీ, అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మాణింపబడునన్నీ ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
Miss.మట్ట రమ్య
ముమ్మిడివరం — అడ్వకేట్స్,ముమ్మిడివరం
ది.2-08-2025 — 9440041751,9440528135

సహాయం అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

## బాధితులకు కళాశాల యాజమాన్యం ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - అమలాపురం రూరల్**

అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు బాధితులకు అమలాపురం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం శనివారం కళాశాల వద్ద ఆర్థిక సాయం అందజేశారు. అమలాపురం మండలం రోళ్ళపాలెం గ్రామానికి చెందిన చిన్నారిభార్గవ్ రామ్ గుండె జబ్బుతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం భార్గవ్ కుటుంబ సభ్యులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రూ.5వేలు, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రావులపాలెంకు చెందిన నారాయణరావు కు మరో రూ.5వేలు ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహరావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, సేవారత్న కరాటం ప్రవీణ్, చోడే జాన్ పాల్, యాలంగి వరప్రసాద్, సిహెచ్ సంసోన్, కె.శ్రావణ్ దిలీప్, డాక్టర్ కె.హేమ విజిత, వెంకట్, శ్రీనివాస్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్వతారోహకుడు లక్ష్మణ్‌కు ఘన సన్మానం

**ప్రజాశక్తి-నిడదవోలు**

జాతీయ పర్వతారోహణ దినోత్సవం సందర్భంగా నిడదవోలుకు చెందిన పర్వతారోహకుడు కంచడపు లక్ష్మణ్‌ను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శనివారం ఘనంగా సన్మానించారు. రోటరీ ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్, దారపురెడ్డి శ్రీ రామప్రతాప్, గుంటుపల్లి సత్యసాయి, గుంటుపల్లి శ్రీనివాసరావు, భూపతి ఆదినారాయణ, పచ్చిపులుసు శ్రీరామారావు, పోలదాసు శ్రీనివాసరావు, నీలం నాగేంద్రప్రసాద్, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, సానేపు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

## ఘనంగా మున్సిపల్ చైర్మన్ భూపతి పుట్టినరోజు

**ప్రజాశక్తి-నిడదవోలు**

స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్ ఆధ్వర్యంలో సీనియర్ రోటేరియన్, నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ 71వ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. రోటరీ సభ్యులు, కేకు కట్ చేయించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ రోటరీ క్లబ్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్, సెక్రటరీ దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, ట్రెజరర్ గుంటుపల్లి సత్య సాయి, రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ గుంటుపల్లి శ్రీనివాసరావు తో పాటు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్నా డివిజనల్ ఉపావిద్యాశాఖధికారి పి లక్ష్మణమూర్తి

## టెన్త్ విద్యార్థులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలి

**ప్రజాశక్తి - అయినవిల్లి**

పదవ తరగతి విద్యార్థులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ప్రతిరోజు ఆయా సబ్జెక్టులను చదివి పునఃశ్చరణ చేసుకోవాలని రామచంద్రపురం డివిజినల్ ఉపవిద్యాశాఖాధికారి పి.లక్ష్మణమూర్తి అన్నారు. ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు పాఠశాలలో జరుగుతున్న పిఎమ్ శ్రీ పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు, ఉపాధ్యాయులు తోపెల్ల శ్రీనివాసరావు ,వీధి దుర్గారావు తది తరులు పాల్గొన్నారు.

## రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-పెరవలి**

మండలం తీపర్రు, కాకరపర్రు, పెరవలి గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించామని తహశీల్దారు కె.నిరంజన్ తెలిపారు. గ్రామంలో వ్యవసాయ భూములు కలిగిన ప్రతి ఒక్క రైతు భూమి వివరాలు, పేరు, ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్, సర్వే నెంబర్, భూమి విస్తీర్ణం, భూమి స్వభావం మొదలగువటిపై అందుబాటులో ఉన్న రికార్డులలోని సరిచూసుకొని తప్పులు ఉన్న ఎడల వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలని తెలిపారు.

## సిబ్బందికి ఘనంగా వీడ్కోలు

**ప్రజాశక్తి - ఉండ్రాజవరం**

పసలపూడి సచివాలయంలో ఐదేళ్ల పాటు సేవలందించి, బదిలీ అయిన ఉద్యోగులకు శనివారం పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కారం నిర్వహించారు. ఎఎన్ఎం బి.సునీత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎల్.ముఖేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.భీమరాజు ఇటీవల ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వీరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కట్టా లక్ష్మి, ఉప సర్పంచ్ కక్కిరాల వీర వెంకట సోమేశ్వరరావు, బలుసు వెంకటరత్నం పాల్గొన్నారు.

## 6న మెగా జాబ్ మేళా

**ప్రజాశక్తి - ఏలేశ్వరం**

ఈనెల 6వ తేదీన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్, నైపుణ్య అభివృద్ధి అధికారి ఎమ్ కొండలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసి 19 నుంచి 35 సంవత్సరాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా కంపెనీలు అదే రోజు నియామక పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

**మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం**

(మైనరు దొంతంశెట్టి రాఘవ ప్రకాష్ వయస్సు15 కొరకు)

**G.W.O.P.71/2025**

**Between:-**
దొంతంశెట్టి మురళీ మోహన్ వెంకటేశ్వర రావు S/o.దొంతంశెట్టి సాంబ సదా శివరావు, హిందు, వయస్సు 52, R/o.ప్లాట్‌నెం.12,2వ ఫ్లోర్, 4th cross భవనేశ్వరి నగర్ జనభారతి 2వ Stage, బెంగుళూర్, కర్నాటక రాష్ట్రం. ...పిటీషనర్
And
Nill ...రెస్పాండెంట్స్

పై నెంబరు గార్డియన్ గ్రంథంలో చనిపోయిన శ్రీమతి ఆకాశం సుభాషిణి @ దొంతంశెట్టి సుభాషిణి గారి కుమారుడు అయిన దొంతంశెట్టి రాఘవ ప్రకాష్ మైనరు అయినందున పిటీషనర్ అయిన దొంతంశెట్టి మురళీ మోహన్ వెంకటేశ్వరరావు గారిని గార్డియన్‌గా నియమించమని మరియు మైనరు యొక్క అభివృద్ధి, చదువు, కొరకు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని విక్రయించుటకు అనుమతులు కోరుచూ దాఖలు చేసిన G.W.O.P. లో ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల **ది.12-08-2025** ఉదయం **10.30ని॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

**మైనరు యొక్క ఆస్తి వివరములు**

**A Schedule for site**

East Godavari district, Kadiyam Sub-registry Limits, Hukumpeta village and panchayat an extent of 637.33 sq yards in Old RS No 1099/1,2 (total extent of Ac 11-22 cents after sub-division in present R S No 1099/1B (Ac 0.33 cents in middle part of total extent of Ac 2-00 cents) situated in Hukumpeta, villag and panchayat, Rajamahendravaram Rural Mandal and bounded by: **East:** Property of Muppana Rajkumar96-00 ft **South:** 40-0 ft Road59-9 ft **West:** Property of Nakka Surya Chandra96-0 ft **North:** Property of Boppanan Ratnaji59-9ft Within the above boundaries an extent of 637.33 sq yards or 532.97 sq mts site in that undivided and unspecified 1/22nd share which comes to 28.97 sq yards or which comes to 24.22 sq meters with co-owners, common and joint rights including the rights of easement etc.,

**B schedule Flat**

Within the above A Schedule Site the apartment constructed under the name and style of Sai Ganesh Plaza, in the third floor plinth Area 1250 sq ft (including common area, balconies and car parking) which was constructed in the above schedule A Site and bounded by: **East:** Open to sky **South:** Open to Sky **West:** Common Corridor **North:** Open to sky Within the above boundaries and extent of 1250 sft with all electrical fittings electrical service connections and all other easement rights,

**యిన్నమూరి బాల సుబ్రహ్మణ్యం**
రాజమండ్రి — అడ్వకేట్,రాజమండ్రి
2-08-25 — సెల్.9700845909

**పబ్లిక్ నోటీసు**

మా క్లైంట్ శ్రీ తెమ్మనబోయిన గంగబాబు(S/o నాగభూషణం) సంపర,పెదపూడి మండలం కాకినాడ జిల్లా వారి సంజాయిషి పై యావన్మందికి తెలియ జేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి శ్రీమతి కర్రి పద్మావతి (W/o సత్తిరెడ్డి) కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా వారు **ది.09-07-1987** తేదీన రిజిస్టరీ క్రియ దాస్తావేజు ద్వారా శ్రీమతి కడిమి సత్యానందం గారి వల్ల స్వాదీనం పొంది నాటి నుండి నేటి వరకు స్వాదీన హక్కు భుక్తములలో ఉన్న సదరు ఆస్తి నా క్లైంట్ క్రియం పొందుటకు ఏర్పాటు చేసుకుని ఉన్నారు. సదరు ఒరిజినల్ దస్తావేజులు పోయినందున ఈ ప్రకటన ద్వారా యామన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు షెడ్యూల్ ఆస్తి పై ఎవరికైనా ఎట్టి హక్కులుగాని, తనఖాలు గాని, చార్జీలు గాని, ఆక్షేపణలు కానీ ఉన్న ఎడల ఈ ప్రకటన విడుదల తేదీ లగాయితు వారం రోజులు లోగా ఈ క్రింది అడ్రస్ వారికి వ్రాతపూర్వకంగా తెలియ పరచుకొనవచ్చును. గడువు తేదీలోగా ఎట్టి అభ్యంతరములు రాని యెడల షెడ్యూల్ ఆస్తిని నిర్వివాద, నిష్పేచిలేని ఆస్తిగా ఎంచి మా క్లైంట్ షెడ్యూల్ ఆస్తిని రిజిస్టర్ క్రయ దస్తావేజు ద్వారా స్వాదీనం పొందగలరు. తదుపరి వచ్చిన క్లైంట్లు గాని ఆక్షేపణలు గాని చెల్లనేరవు మాక్లైంట్‌ను బైండ్ చేయవు.

**ఆస్తి షెడ్యూలు**

కాకినాడ జిల్లా (గతంలో తూర్పుగోదావరిజిల్లా), కాకినాడ సబ్ రిజిస్టర్ పరిదిలోని పెదపూడి మండలం సంపర గ్రామం తాలూకు జిరాయితీ పల్లం రి.సరే.నెం.407/2 లోని పూరా య.0.84 సెంట్లు లేదా 0.34 హెక్టార్లు భూమికి హద్దులు

**హద్దులు**

**తూర్పు:-** నాగిరెడ్డి లచ్చారావు వగైరాలు జిరాయితీ భూమి, **ఉత్తరం:-** మట్ట సూర్యనారాయణ వగైరాలు జిరాయితీ భూమి **దక్షిణం:-** నాగిరెడ్డి వెంకన్న గారి కుమారుడు వీరాస్వామి వగైరాల జిరాయితీ భూమి, **పడమర:-** మట్ట సరోజినీ వగైరాల జిరాయితీ భూమి, సదరు హద్దులు మధ్యస్థమైన య.0.84 సెంట్లు పల్లపు భూమి అందు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా

**ఉండ్రు విజయలక్ష్మి**
అడ్వకేట్&నోటరీ
కాకినాడ — తూరంగి,కాకినాడ
తేది.02-08-2025 — సెల్.9441437075